క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భీంపూర్: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ తిరుపతి రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 33కేవీ అర్లి(టి) ఫీడర్లో మరమ్మతుల కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని అర్లి(టి), కరంజి, గోమూత్రి, అంతర్గామ్, వడూర్, దనోర గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు బీజేపీ కార్యవర్గ సమావేశం

భీంపూర్: మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు బీజేపీ కార్యవర్గ సమావేశం నిర్వహించడం జరుగుతుందని మండల అధ్యక్షుడు అంకం అశోక్ శనివారం తెలిపారు. నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కూచిపూడి కోర్సు పరీక్ష రాసిన చిన్నారులు



పర్యవేక్షిస్తున్న కళా కేంద్రం ఎగ్జామినర్స్

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని బాల కేంద్రానికి చెందిన 28 మంది కూచిపూడి అభ్యసిస్తున్న చిన్నారులు శనివారం జిల్లా కేంద్రంలో కూచిపూడి సర్టిఫికెట్ కోర్సు పరీక్ష రాశారు. లక్నో యూనివర్సిటీ భారతి కళా కేంద్రం నుంచి వచ్చిన ఎగ్జామినర్ సచిన్ దంబారే, రవీష్ గాంధీలు పరీక్ష నిర్వహణను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్షలో థియరీతో పాటు, చిన్నారుల నృత్య నైపుణ్యాన్ని సైతం పరీక్షించడం జరుగుతుందన్నారు. చిన్నారులంతా పరీక్షల్లో ఉత్తీర్ణులు అవుతారని బాలకేంద్రం సూపరింటెండెంట్ మిట్టు రవి ఆశాభావం వ్యక్తం చేశారు.

జనసేన సభ్యత్వ నమోదు కిట్ల పంపిణీ

ఆదిలాబాద్‌టౌన్: జనసేన క్రియాశీల సభ్యత్వ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం పట్టణంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించారు. పలువురు నాయకులు, కార్యకర్తలకు సభ్యత్వ నమోదుకు సంబంధించిన కిట్లను అందజేశారు. నాయకులు శ్రీరాం అనిల్ కుమార్, చింతవర్ సందీప్, సాయిరి వినయ్, ఉడుగు రవితేజ, జక్కుల కార్తీక్, భూపతి వివేక్, అల్వాల్ సంతోష్ పాల్గొన్నారు.

'దేవానంద్ కుటుంబం ఎస్టీ కాదు'



మాట్లాడుతున్న నాయకులు

ఇచ్చోడ: మండల కేంద్రానికి చెందిన చౌహాన్ దేవానంద్ కుటుంబసభ్యులు ఎవరూ కూడా ఎస్టీ కాదని ఆల్‌ఇండియా బంజారా సేవ సంఘం నాయకులు ఆడే మానాజీ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేవనంద్ తప్పుడు ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు సృష్టించి మూడుసార్లు తన కూతుళ్లను సర్పంచ్‌గా, ఒక్కసారి తాను ఎంపీటీసీగా గెలుపొందారని తెలిపారు. అతడిపై ఎన్నికల కమిషన్ వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బంజారా సేవ సంఘం ఎస్టీ కమిషన్ ఫిర్యాదు మేరకు కమిషన్ సభ్యులు పూర్తి విచారణ తర్వాతే జిల్లా కలెక్టర్‌కు నివేదించినట్లు పేర్కొన్నారు. కలెక్టర్ ఉత్తర్వులను దేవనంద్ తప్పుడపట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలతో పదవులు అనుభవించి ప్రజాధనాన్ని వృథా చేసిన దేవనంద్ కుటుంబ సభ్యులుపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బంజారా సేవ సంఘం నాయకులు శివలాల్‌నాయక్, రాముల నాయక్, నరేందర్‌నాయక్, రమే శ్, బలిరాం నాయక్, చౌహాన్ వినంత్‌రావు, చౌహాన్ సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.



సిరికొండలో..



నేడిగొండ: శుభాకాంక్షలు తెలుపుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



ఉట్నూర్‌రూరల్: శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే బొజ్జు

భక్తిశ్రద్ధలతో బక్రీద్

జిల్లా వ్యాప్తంగా ముస్లింలు బక్రీద్ పండుగను శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచే ఈద్గా, మసీద్‌ల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు అలింగనం చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ముస్లిం మత పెద్దలు ప్రవక్త బోధనలు వివరించారు. ఖానాపూర్‌లో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, నేడిగొండలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. - సాక్షి, నెట్‌వర్క్



ఇంద్రవెల్లి: ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



జైనథ్: సేమియాలు పంపిణీ చేస్తున్న ముస్లింలు



భీంపూర్: ఈద్గా వద్ద ముస్లింల ప్రార్థనలు



నార్నూర్: ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



బోథ్: శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్సై, సిబ్బంది



బేల: ఆలింగనం చేసుకుంటున్న ముస్లింలు

పరామర్శ



పరామర్శిస్తున్న జోగు రామన్న

జైనథ్: జైనథ్ మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ గడ్డం రాజారెడ్డి సతీమణి త్రివేణి శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మాజీ మంత్రి జోగు రామన్న, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రంగినేని మనీషా, సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డిలు వారి నివాసానికి చేరుకుని బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.

అడెల్లు కుటుంబసభ్యులకు..

బోథ్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో శుక్రవారం ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్ట్ మైలారపు అడెల్లు కుటుంబాన్ని శనివారం మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ పరామర్శించారు. కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

గర్భిణులకు పోషకాహార కిట్లు పంపిణీ

ఆదిలాబాద్‌రూరల్: హైదరాబాద్ నగరానికి చెందిన స్ట్రీట్ కేస్ విజిత్, ఎంపీఎస్ఆర్, ఆదిలాబాద్‌కు చెందిన స్వస్ స్వచ్ఛంద సంస్థ బృందం సభ్యులు శనివారం మండలంలోని మొలాల గుట్ట, కొలాంగూడ గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో పర్యటించిన వారు గర్భిణులకు, చిన్నారులకు పోషకాహేకార కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హేతల్, లక్మణ్ సింగ్, కొండా గోవర్ధన్, సాయి కిరణ్, అక్షయ్, వెంకటేశ్, అశోక్ పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య



అడ్మిషన్లు చేస్తున్న ఉపాధ్యాయులు

సాత్నాల: మండలంలోని జామిని గ్రామంలో శనివారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు గ్రామ విధుల గుండా ర్యాలీ చేపట్టారు. గడప గడపకు తిరుగుతూ.. బడీడు పిల్లలను గుర్తించారు. అంగన్‌వాడీ టీచర్ల సహకారంతో వారికి అడ్మిషన్లు కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శరత్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ బడీడు, డ్రాపౌట్స్ విద్యార్థులను గుర్తించి పాఠశాలల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లుగా పేర్కొన్నారు. పాఠ్యపుస్తకాలు రెండు జతల దుస్తులు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అమ్మఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ నైతం దేవుబాయి, మహాజన్ కృష్ణ, మాజీ సర్పంచ్ పెందూర్ మోహన్ పాల్గొన్నారు.



బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

చిన్నారులను ప్రభుత్వ బడికి పంపించాలి

ఆదిలాబాద్‌రూరల్: తల్లిదండ్రులు చిన్నారులను ప్రభుత్వ బడికి పంపించాలని మామిడిగూడ ఆశ్రమ పాఠశాల స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు రొడ్డ శైలజ అన్నారు. టీడబ్ల్యూపీఎస్ పాఠశాలలో రెండో తరగతి పూర్తి చేసిన విద్యార్థులను ఆశ్రమ పాఠశాలలో చేర్పించాలన్నారు. శనివారం మండలంలోని దహిగూడ, సల్పాలగూడ, కొలాంగూడ పాఠశాలలను సందర్శించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన బడిబాట కార్యక్రమాన్ని పరిశీలించారు. నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్న భోజనం అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌సీఆర్‌పీ మధుసూదన్, ప్రధానోపాధ్యాయులు ఇస్తారి, దత్తు, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పశువైద్యాశాలలు



భోరజ్ పశువైద్యశాల

భోరజ్ మండల కేంద్రంతో పాటు గిమ్మ గ్రామంలోని పశువైద్యశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. భోరజ్ మండల కేంద్రంలోని భవనం పైకప్పు పెచ్చులూడుతుంది. ఎప్పుడు కూలుతా యో తెలియని పరిస్థితి నెలకొంది. వైద్యసేవలు అందించేందుకు పశువైద్యాధికారులు భయాందోళన చెందుతున్నారు. - సాత్నాల

పంట చేలకు రోడ్డు సౌకర్యం కల్పిస్తాం

- ఎమ్మెల్యే పాయల్ శంకర్

జైనథ్: వర్షాకాలంలో తమ పంట చేలకు వెళ్లేందుకు రైతులు పడుతున్న ఇబ్బందులను దూరం చేసేలా రోడ్డు సౌకర్యం కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతుల పంటచేలకు వెళ్లే రోడ్డు నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. రూ.28 లక్షల వ్యయంతో ఐదు కిలోమీటర్ల మేర నిర్మించనున్న మట్టి రోడ్డు పనులను రైతులతో కలిసి ప్రారంభించారు. విడతలవారీగా నియోజకవర్గంలోని అన్ని గ్రామాల రైతులు వర్షాకాలంలో కూడా చేనులకు వెళ్లే విధంగా రోడ్డు సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో పనులు చేపట్టేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లుగా తెలిపారు. తాను అసెంబ్లీలో ప్రస్తావించడంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లోక కరుణాకర్ రెడ్డి, అశోక్ రెడ్డి, రాకేశ్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, ప్రతాప్ యాదవ్, లస్మన్న, అశోక్, లింగారెడ్డి, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

అంగన్‌వాడీలో కుళ్లిన గుడ్లు, సరుకులు

- లబ్ధిదారులకు అందించని వైనం
- ఆగ్రహం వ్యక్తం చేసిన గుట్టపక్కతండా గ్రామస్తులు

బోథ్: సొనాల మండలంలోని గుట్టపక్కతండా అంగన్‌వాడీ కేంద్రం నిర్వాహకులు లబ్ధిదారులకు సరుకులు అందించకపోవడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేసి, సరుకులు బయట పడేసిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గుట్టపక్కతండా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఇన్‌చార్జిగా పుణ్యానాయక్ గ్రామంలోని అంగన్‌వాడీ కార్యకర్త వ్యవహరిస్తున్నారు. కాగా గత మూడు నెలలుగా గర్భిణులకు, చిన్నారులకు ఇవ్వాల్సిన పోషకాహారం, గుడ్లు, పాలు, ఇతర సరుకులు ఇవ్వలేదు. అంగన్‌వాడీ కేంద్రంలో నుంచి దుర్వాసన రావడంతో గ్రామస్తులు తలుపులు తెరిచి, సూపర్‌వైజర్‌కు సమాచారం అందించారు. కేంద్రంలోకి వెళ్లి చూడగా.. కుళ్లిన గుడ్లు, పురుగులు ఉండటం గమనించి అవాక్కయ్యారు. కాలం చెల్లిన పాలు, ఇతర పోషక ఆహారం కనిపించాయి. దీంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సరుకులను బయట పడేశారు. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు అన్నారు.



గ్రామస్తులు బయట పడేసిన సరుకులు

వాంకిడికి పూర్వ వైభవం తీసుకువస్తా

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: వాంకిడి గ్రామానికి పూర్వ వైభవం తీసుకొస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం మండలంలోని వాంకిడి గ్రామంలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి విద్యుత్ శాఖ ఎస్ఈ చౌహాన్ జయవంత్ రావుతో కలిసి భూమిపూజ చేశారు. రైతులకు సకాలంలో 24 గంటల విద్యుత్ అందుబాటులో ఉంటుందన్నారు. మండలంలో ఆదర్శ గ్రామంగా వాంకిడిని తీర్చిదిద్దుతానని అన్నారు. కాగా అంతకుముందు ఎమ్మెల్యేను గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డి, జాదవ్ గణేష్, రవీందర్ రెడ్డి, సురేందర్, రమేశ్, సవైరాం, గులాబ్ సింగ్, దేవేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం

- విత్తన విక్రయ దుకాణాల్లో అధికారుల తనిఖీలు
- నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని సూచన

తాంసి: రైతులు విత్తనాల విషయంలో ఎలాంటి మోసాలకు గురికాకుండా నాణ్యమైన విత్తనాలతో పంటలు సాగు చేసేందుకు అధికారులు దృష్టి సారిస్తున్నారు. రైతులు నకిలీ విత్తనాల బారిన పడకుండా జిల్లాలో అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో రైతులు సాగుకోసం వివిధ రకాల విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. వ్యవసాయశాఖతో పాటు రెవెన్యూ, పోలీస్‌శాఖ అధికారులు నకిలీలపై ఉక్కుపాదం మోపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా మండలాల్లో టాస్క్‌ఫోర్స్ టీంలను ఏర్పాటు చేసి తరుచూగా విత్తనాల దుకాణాల్లో తనిఖీలు చేపడుతున్నారు. టీంల వారీగా ఎప్పటికప్పుడు విత్తన దుకాణాల్లో, అక్రమ వ్యాపారుల ఇళ్లలో అనుమతి లేని విత్తనాలు పట్టుకుంటున్నారు.

17 విత్తనాల విక్రయ దుకాణాలు..

మండలంలోని 14 పంచాయతీల్లో మొత్తం 17 దుకాణాల ద్వారా ఈ ఏడాది విత్తనాలను విక్రయించేందుకు వ్యవసాయశాఖ అధికారులు అనుమతులు ఇచ్చారు. సీడ్స్ షాప్ యజమానులు ప్రభుత్వం అనుమతి ఇచ్చిన వివిధ కంపేనీలకు చెందిన విత్తనాలను కొనుగోలు చేసి రైతులకు విక్రయించాల్సి ఉంటుంది. అయితే కొందరు వ్యాపారులు ప్రతీ ఏటా పక్కనున్న మహారాష్ట్ర, ఇతర ప్రాంతాల నుంచి అనుమతి లేని నకిలీ విత్తనాలు, బీటీ–3 విత్తనాలు తీసుకొచ్చి ఇక్కడి రైతులకు అంటగడుతున్నారు. దీంతో సరైన దిగుబడి రాక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. విత్తనాలు విక్రయించే దుకాణ యజమానులకు ముందస్తుగానే అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. రైతులకు ఏమైనా కొనుగోలులో ఏమైనా అనుమానాలు ఉంటే ఫిర్యాదు చేసే విధంగా దుకాణాల ఎదుట మండల, జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు ఫోన్ నంబర్లతో కూడిన బోర్డులను ఏర్పాటు చేశారు.

అధికంగా పత్తి విత్తనాలు..

మండల వ్యాప్తంగా మొత్తం 15 వేల ఎకరాలు సాగు చేయగా.. అందులో 10వేల ఎకరాల్లో రైతులు పత్తి పంట వేయనున్నారు. పత్తి తర్వాత కంది, సోయా పంటలు వేయనున్నట్లు వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. అయితే అధికంగా 80కు పైగా పత్తి పంట సాగు చేస్తుండటంతో పత్తి విత్తనాలు నకిలీ రాకుండా చూసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అవసరమైన విత్తనాలు విత్తనాల దుకాణాల్లో అందుబాటులో సైతం ఉండేటట్లు ముందు జాగ్రత్త విత్తనాలను నిల్వలు చేసేలా చర్యలు తీసుకున్నారు. ఎప్పటికప్పుడు దుకాణాలను తనిఖీ చేస్తూ రైతులకు విత్తనాలను విక్రయించిన విత్తనాల వివరాలు, స్టాక్ నిల్వలను సైతం పరిశీలిస్తున్నారు. నకిలీతో పాటు అనుమతి లేని విత్తనాలను పట్టుబడితే కేసులు నమోదు చేస్తున్నారు.



పొన్నారిలో తనిఖీలు చేస్తున్న తహసీల్దార్ లక్ష్మి

లైసెన్స్ రద్దు చేస్తాం



నకిలీ విత్తనాలను అరికట్టడంలో భాగంగా తనిఖీలు నిర్వహిస్తున్నాం. ముందు జాగ్రత్త చర్యలో భాగంగా దుకాణాల వ్యాపారులతో సమావేశం నిర్వహించి ప్రభుత్వ అనుమతి లేని విత్తనాలను విక్రయించవద్దని ఆదేశాలు జారీ చేశాం. అనుమతి లేని విత్తనాలు విక్రయిస్తే దుకాణాల లైసెన్స్ రద్దు చేస్తాం.
– రవీందర్, వ్యవసాయాధికారి, తాంసి

సమాచారం ఇవ్వాలి



ఎక్కడైనా నకిలీ విత్తనాలను నిల్వ చేసినట్లు, విక్రయిస్తున్నట్లు తెలిస్తే ప్రజలు వెంటనే సమాచారం అందించాలి. నకిలీ విత్తనాలను రాకుండా ఇప్పటికే టాస్క్‌ఫోర్స్ టీం ద్వారా విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహించాం. ఎక్కడైనా అనుమతి లేని విత్తనాలను విక్రయిస్తే సమాచారం ఇవ్వాలి.
– దివ్య భారతి, ఎస్సై, తాంసి

మురుగు చెంతనే.. ప్రార్థనలు

బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఈద్గా మైదానంలో శనివారం ముసిస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థలం లేకపోవడంతో రోడ్డుపై ప్రవహించే మురుగునీరు పక్కనే ప్రార్థనలు చేశారు. బల్దియా అధికారులు ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.
- సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



కొనసాగుతున్న హనుమాన్ చాలీసా పారాయణం



పారాయణంలో పాల్గొన్న సభ్యులు

బోథ్: సొనాల మండల కేంద్రంలోని రామాలయంలో హిందూ ధర్మ జాగరణ మండలి ఆధ్వర్యంలో ప్రతీ శనివారం నిర్వహించే సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం 77వ వారానికి చేరుకుంది. హనుమాన్ చాలీసా పారాయణం వల్ల భక్తిశ్రద్ధలు, ఏకాగ్రత, ఆధ్యాత్మిక భావన , క్రమశిక్షణ, మంచి భావాలు అలవరుతాయని సభ్యులు పేర్కొన్నారు. వంద వారాల పాటు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం కొనసాగుతుందని వారు తెలిపారు.